# యజ్ఞం

కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

బెంగుళూరులో డిసెంబరు నెల చివరి వారం. అర్ధరాత్రి మీరింది. నగర లలనామణికి అందమైన ఆభరణాల్లో ఒకటైన రాజాజీ నగర్ కాలనీలో రెండవ క్రాస్ వద్ద మూడో ఇంట్లో వాతావరణం ప్రశాంతంగా వుంది.

నాలుగు బెడ్ రూముల ఫ్లాట్ అది. డ్రాయింగ్ రూం అనుకుని వున్న ముందు వైపు బెడ్ రూంలో కోటేశ్వరరావు దీర్ఘాలోచనలో వున్నాడు. చలిగాలి కిటికీ లోంచి జివ్వు మని పిస్తున్నా లేచి కిటికీ రెక్కలు వెయ్యలేదు. బెడ్ కాళ్ళవేపు నుండి హీట్ కన్వెక్టర్‌లో నుండి వెచ్చటిగాలి బయటికి వస్తూ కాళ్ళని వెచ్చ చేస్తూంది. వెనకాల బెడ్ రూంలో కొడుకు రాజేశ్వరరావు, కోడలు రాణి గాఢ నిద్రలో ఉన్నట్లుంది. ముందు ప్రక్క లాన్‌లో ఓ మూలగా వేసిన హట్‌లో తోటమాలి రామయ్య గురక తనకు కిటికీలోంచి స్పష్టంగా వినిపిస్తూంది.

కర్తవ్యం స్ఫురించిన వాడిలా చివుక్కున లేచాడు కోటేశ్వరరావు బి.పి. ట్రీట్‌మెంట్ తీసుకుంటువున్న వాడు ఒక్కసారిగా లేవడంతో కళ్ళు బైర్లు కమ్మాయి. నెమ్మదిగా నిలద్రొక్కుకున్నాడు. ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్న అవకాశం ఇప్పుడొచ్చింది. ఈ చలికాలంలో ఎవరూ చూడకుండా తను చెయ్యాల్సిన పని ఒకటుంది. అది చెయ్యడానికి మనసు ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నా ఎప్పుడూ ఏదో ఒక ప్రతి బంధకం. శరీరం కూడ జరాభారంతో క్రుంగి పోతూంది. ఇవాళ ఏమైనా సరే పూర్తి చెయ్యాల్సిందే. ఎన్ని ధర్మ కార్యాలు చేసినా ఈ కార్యం చెయ్యలేదనే లోటు ఎప్పుడూ మనసులో వెలితిగా వుంది. అందుకే భగవంతుడు కల్పించిన ఈ అవకాశాన్ని వృధా చెయ్యదలుచు కోలేదు. ఇక ఆలస్యం చెయ్యకుండా ఎప్పటినుండో, తన పర్సనల్ కప్ బోర్డ్‌లో దాచి యుంచిన ఇరవై దుప్పట్లున్న కట్ట తీసి టేబులుపై పెట్టాడు. ఇప్పటి వరకూ తన ఆరోగ్యం బావుంది. ఈ సారికి కూడా అలాగే ఉంటే మున్ముందు మరో ముప్పై దుప్పట్లు తెప్పించాలి, అనుకుంటూ ఫర్ కోటు తొడుక్కుని చేతికి గ్లోవ్స్, తలకు హ్యాటు పెట్టుకున్నాడు..

చాలా బరువుగా అనిపిస్తున్న ఆ దుప్పట్ల కట్టను ఓ భుజం మీద వేసుకుని మెల్లిగా అడుగులు వేస్తూ బయటి గేటు వరకూ వచ్చాడు. ఓ నిముషం ఇంటి వేపు పరకాయించి చూశాడు. తనని ఎవరూ గమనించడం లేదు. వీధి నిర్మానుష్యంగా వుంది. కాలనీ దాటి మెయిన్ రోడ్ వరకు నడిచేటప్పటికి అలసట వచ్చింది. మెల్లిగా భుజం మీద బరువును క్రిందకు దించి నుదుట పట్టిన చెమటను తుడుచుకున్నాడు.

రెండు నిముషాలు నిలబడే రెస్టు తీసుకుని దుప్పట్ల కట్ట భుజం మీదనెత్తుకుని తన పవిత్ర యజ్ఞం కోసం బయలు దేరాడు. అతని శ్రమ వృధా కాలేదు. నగరంలో కెల్లా గొప్ప నగల వర్తకుడు శేఠ్ రతన్‌లాల్ కొట్టుముందు చిరిగి శిథిలమైన చొక్కాతో ఒక బిడ్డ, ఆ బిడ్డ పక్కనే చలికి గువ్వలా ఒదిగి పోయి కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకుని వున్న ఓ ఆడ ఎముకల గూడు కన్పించారు. వారు కప్పుకున్న చింకి గోనె పట్టా వారి సగం శరీరాల నైనా కప్పలేక పోతోంది. కర్తవ్యం మరచి నిలబడి పోయాడు కోటేశ్వరరావు. యాభై ఏళ్ళు క్రితం తనుకూడా ఇదేవిధంగా చలికి వణకుతూ బికారిలా వీధుల్లో పడుకున్నాడు. ఆ చలి ఎంత భయంకర మైనదో అనుభవ పూర్వకంగా



తెలుసు కున్నాడు. పెరిగే వయసుతో బాటు, సంపద పెరిగినా ఆ పూర్వపు రోజులు ఎపుడూ మర్చి పోలేదు. వారి నికృష్టమైన బ్రతుకులో ఓ ఆశ్చర్యకరమైన సంతోషం కలిగించాలనుకున్నాడు.భుజం మీద కట్టలోంచి రెండుదుప్పట్లు తీసి ఒకటి బిడ్డకు రెండోది ఆ బక్క చిక్కిన తల్లికి కప్పాడు. వెంటనే కదిలి పోయాడు. పది హేను దుప్పట్లు ఖర్చయేటప్పటికి రెండు కిలో మీటర్లు పైనే నడవాల్సి వచ్చింది. ఇక అయిదు మంది అనాథలు కనిపిస్తే తన యజ్ఞం పూర్తవుతుంది. కాని కన్పించలేదు. రోడ్డంట అలా భారంగా నడుస్తున్నాడు కోటేశ్వరావు.

చలిగాలి అలవాటు లేక పోవడం వల్లనో లేక బరువు మొయ్యడం చేతనో ఒక్కసారిగా ఎడం వేపు ఛాతీ నొప్పి ప్రారంభమయింది. శరీరం తుఫానులో చిక్కుకున్న నావలా అటూ ఇటూ ఊగ సాగింది. ఇక నడవలేనట్లుగా కాళ్ళు నిస్సత్తుగా నిలిచి పోయాయి. రోడ్డు వారగా ఫుట్ పాత్ పై కూల పడ్డాడు. చెమటతో శరీరం ముద్దగా తడిసి పోతూంటే కోటు తీసి అవతల పారేశాడు. గుండె నెప్పికి తాళ లేక మెలికలు తిరిగి పోయి పడి పోయాడు. దాహంతో నాలుక పిడచ కట్టుకు పోతున్నది. ఎవర్ని సాయం పిలవాలో తెలీక ఆ భగవంతుడిని ఓమారు స్మరించుకున్నాడు. దేవుడే పంపినట్లు వాళ్ళ కాలనీ గూర్ఖా ఆ దారంట అప్పుడే

వచ్చి కోటేశ్వరరావును గుర్తుపట్టాడు.

"సాబ్! ఆప్ యహా! కైసే!!"

జవాబు చెప్పేందుకు శక్తి లేనట్లుగా చేత్తో సైగ చేశాడు కోటేశ్వరరావు. నాకు చివరి క్షణాలు దగ్గరి కొచ్చేశాయి. దుప్పట్లన్నీ నువు తీసుకో నేను ఇక్కడ పడి పోయానని ఇంటి దగ్గర కొడుక్కు చెప్పమన్న భావం కూడా వుంది అతని సైగలో. కోటేశ్వరరావు ధార్మిక బుద్ధి, దాతృత్వం ఎరిగున్న గూర్ఖా అతన్ని భుజం మీద వేసుకుని వాళ్ళ బంగళా వేపుగా బయలు దేరాడు. కాని ఇల్లు చేరేలోపల, కోటేశ్వరరావు తన యజ్ఞంలో తనే ఒక సమిధ అయి కాలిపోయాడని పాపం ఆ గూర్ఖాకి తెలీదు.

– జె. అరవిందాచలం